క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మందికి ఉద్యోగాలు



తెనాలి: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థులు ఏడుగురు విప్రోకు, ఇద్దరు టీసీఎస్‌కు, బీకాం ఫైనలియర్ విద్యార్థులు ముగ్గురు టీసీఎస్‌కు, ఒకరు ఎల్ అండ్ టిక్నాలజీస్‌కు ఎంపికై నట్టు తెలిపారు. కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల్ని అభినందించారు. ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బొల్లిముంత శివరామకృష్ణ, అధ్యాపకులు శ్రీసుధ, రసూల్, భోగిరెడ్డి వెంకటసుబ్బారావు, శిరీష పాల్గొన్నారు.

పరివర్తన, సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలి



తెనాలి రూరల్: తెనాలి సబ్‌జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆవరణలో ఖైదీల వసతుల గురించి ఆరాతీశారు. ఆహారం, తాగునీటిని పరిశీలించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల జైలుపాలు కావాల్సి వచ్చి ఉంటుందని, ఇకనైనా మారి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తాగునీరు, ఫాగింగ్‌పై జైలు సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమ్మర్ స్పెషల్ బస్సుల ఏర్పాటు

తెనాలి: ఆర్టీసీ తెనాలి డిపో నుంచి వివిధ పుణ్యక్షేత్రాలు, విహార ప్రదేశాలకు సమ్మర్ స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు మేనేజర్ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఇందులో భాగంగా ఊటీ, వేళాంగిణిలకు ఈనెల 27న ప్రత్యేక బస్సులు బయలుదేరతాయని తెలిపారు. ఊటీకి ఏసీ బస్సు ఆరోజు సాయంత్రం 5 గంటలకు తెనాలి నుంచి బయలుదేరి బెంగళూరు, మైసూర్ ప్యాలెస్, మైసూరులోని ముఖ్య ప్రదేశాలతో పాటు మరుసటి రోజు మొత్తం ఊటీలోనే ఉండి ప్రముఖ ప్రదేశాల్ని తిలకించే అవకాశం కల్పిస్తుందని, టికెట్ ధర రూ.4,600గా వివరించారు. అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటలకు సూపర్ లగ్జరీ బస్సు వేళాంగిణి (నాగపట్నం) బయలుదేరుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం నాగపట్నం చేరుకుని రోజంతా అక్కడే ఉండి, మరుసటిరోజు చెన్నైకు చేరుకుని సెయింట్ థామస్ మౌంట్ చర్చి, మెరీనా బీచ్ చూసుకుని రాత్రికి తిరుగు ప్రయాణం ఆరంభిస్తుందని వివరించారు. టికెట్ ధర రూ.3,400గా తెలిపారు. ఇతర వివరాలకు 7382892492/ 9959225422 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

మందుబాబులపై కేసులు

తెనాలి రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం శివారు చినపరిమి డొంక రోడ్డు, ఇతర ప్రదేశాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న ఐదుగురిని రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు శనివారం గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు. పెదరావూరు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని 10 ద్విచక్ర వాహనాలు, మూడు ట్రాక్టర్లు, రెండు లారీలు, ఏడు ఆటోల డ్రైవర్లకు రూ. 3800 అపరాధ రుసుం విధించారు.

వివాహిత అదృశ్యం

తెనాలి రూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన 30 ఏళ్ల కోట ఝాన్సీ ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసుల్ని ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ శనివారం తెలిపారు.

స్నేహితుడిపై చాకుతో దాడి

తెనాలి రూరల్: స్నేహితుడిపై చాకుతో దాడి చేసి గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సుమంత్, వీరబాబు క్యాటరింగ్ పనులకు వెళుతుంటారు. స్వల్ప విషయమై వీరిద్దరూ శుక్రవారం సాయంత్రం ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో వీరబాబు సుమంత్‌పై చాకుతో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు.

పట్టణంలో ట్రిపుల్ ఆర్ పాయింట్లు ప్రారంభం

- పట్టణంలో నాలుగు చోట్ల ఏర్పాటు
- పాత వస్తువులు సేకరించి అవసరమైన వారికి పంపిణీ ఉద్దేశం



ప్రచార అవగాహన ర్యాలీ



సత్యనారాయణ పార్కు వద్ద పాయింట్

తెనాలి: పట్టణ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం రెడ్యూస్, రీసైకిల్, రీయూస్ (ఆర్ఆర్ఆర్) కార్యక్రమాన్ని శనివారం స్థానిక సత్యనారాయణ లేక్ పార్కు వద్ద ప్రారంభించారు. 'మేరే లైఫ్ మేరే స్వచ్ఛ షెహర్' పథకంలో భాగంగా చేపట్టిన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ప్రారంభించారు. పట్టణంలో ఐలమ్మ రజక పార్కు, సత్యనారాయణ లేక్ పార్కు, ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలు, రైల్వేస్టేషను ఏరియాల్లో నాలుగుచోట్ల ఆర్ఆర్ఆర్ పాయింట్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జూన్ అయిదో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం ఏడు గంటల్నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆయా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, పరుపులు, పుస్తకాలు, బ్యాగులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, పాత సైకిళ్లు, మంచాలు, చెక్క టేబుళ్లు, ఎలక్ట్రికల్ పరికరాలు, ఇతర సామగ్రిని ఇక్కడ అందేస్తే, వాటిని అవసరమున్న ఇతరులకు అందజేస్తామని ఖలేదా నసీమ్ వివరించారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. దీనిపై ప్రచార ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శులు, నగర దీపికలు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి జీవితం అందరికీ ఆదర్శనీయం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: 'శాలువా నా కెందుకు అరటిపళ్లు ఇస్తే ఒక పూట గడిచేదిగా' అన్న ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు నిరాడంబర జీవితం.. తెల్లదొరల తుపాకీ గుండుకు గుండెను ఎదురొడ్డిన వీరత్వం.. దేశ దాస్య విమోచన యజ్ఞంలో ఆంధ్రుల్ని ఒక్క తాటిపై నడిపించిన ఆయన మార్గదర్శకత్వం అందరికీ ఆదర్శమని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. ఆంధ్ర కేసరి, ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన నేతల్లో ప్రథముడైన టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా శంకర్ విలాస్ సెంటర్‌లోని ప్రకాశం చౌక్‌లో ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి తదితరులతో కలిసి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడుగా టంగుటూరి ప్రకాశం పంతులును అభివర్ణించారు. పట్టుదలనే పెట్టుబడిగా చేసుకుని, గుండె దిటవునే సాధనంగా మలచుకుని, సమరమే ఊపిరిగా, దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా భావించి జూలు విదిల్చిన సింహమై జీవితం కొనసాగించిన మహోన్నతుడని కొనియాడారు. మహాత్ముడి పిలుపుతో కాసులు కురిపిస్తున్న ప్లీడరు వృత్తిని వదిలి జాతీయోద్యమంలో దూకిన నిస్వార్థ దేశభక్తుడని కొనియాడారు. స్వరాజ్య పత్రిక స్థాపనతో భారతీయుల్లో జాతీయ స్ఫూర్తిని రగిలి్చన నిజమైన గాంధేయవాది అని పేర్కొన్నారు. తెలుగువారి తెగువకు నిలువెత్తు రూపం ప్రకాశం పంతులు అని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శ్లాఘించారు. 'ప్రమాదములున్నచోటే ప్రకాశం పంతులు గారు ఉంటారు' అన్న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు భోగరాజు పట్టాభి సీతారామయ్య మాటలు అక్షర సత్యాలని పేర్కొన్నారు. 1922లో సహాయ నిరాకరణ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న సమయంలో 30వేల మంది స్వచ్ఛందకులతో గుంటూరులో భారీ ప్రదర్శన నిర్వహించారని.. తద్వారా గుంటూరుతో ఆయనకు గట్టి సంబంధం ఏర్పడిందని వివరించారు. దానికి గుర్తుగానే ఆనాడు తామంతా కమిటీగా ఏర్పడి, ఆయన పాదయాత్ర చేసిన ఈ ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ప్రకాశం చౌక్‌గా నామకరణం కూడా చేసినట్లు గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే పదవుల కోసం కాక ప్రజల కోసం పరితపించిన మహనీయుల్లో ప్రకాశం ముఖ్యుడని తెలిపారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడిగా నిలిచారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిలా దేశానికే కాక మంచి పాలకుడిగా రాష్ట్రానికి వన్నె తెచ్చిన టంగుటూరి సేవలు చిరస్మరణీయమని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, ప్రకాశం పంతులు విగ్రహ దాత సుధాకర్, కార్పొరేటర్ అంబేడ్కర్, ఆంధ్రకేసరి అభిమాన సంఘం నేతలు ఐతి సతీష్, బందా శశి, శ్యామ్, హరిప్రసాద్, సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి, విజయమాధవి, సత్యవతి, విజయమ్మ, అరవ తిమ్మరాజు, నెరుసు శ్రీను, భాగ్యారావు, కిరణ్, మహేంద్ర గులేచా, రెడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం





వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్యే ముస్తఫా

ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, ముస్తఫా

నెహ్రూనగర్: ప్రభుత్వ పథకాల్ని ప్రజలకు అందించడంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కొనియాడారు. సేవా మిత్ర, రత్న, వజ్రా పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా శనివారం 22, 49వ డివిజన్లలో వలంటీర్లకు ఆయన పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికీ, ప్రజలు మధ్య వారధులుగా పని చేస్తున్న వలంటీర్ల వ్యవస్థ అంటే సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో ఇష్టమని తెలిపారు. ప్రతిభను బట్టి ప్రతి ఏటా పురస్కారాల పేరుతో వలంటీర్లను సన్మానిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రెండు డివిజన్లలో 120 మంది వార్డు వలంటీర్లకు పురస్కారాలతో పాటు ఎమ్మెల్యే సొంత నిధులతో ప్రతి ఏటా ఇస్తున్న మాదిరిగానే ఆడవారికి చీరలు, మగవారికి షర్టు, ఫ్యాంటు అందజేశారు. కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ గేదెల నాగరంగమణి, 49వ డివిజన్ కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, కిశోర్, జి. జాన్సన్, షేక్ జానీ బాషా, ఎర్రబాషా, తిరుపతిరెడ్డి, షేక్ బాజీ, షుకూర్, ఓలేటి అరవింద్, వి. రాఘవ, తమ్మిశెట్టి రవి, వేణు, రవి కిషన్, శివకుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర కీలకం

కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు గడప వద్దకే అందించే కార్యక్రమంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా కొనియాడారు. శనివారం 1వ వార్డులో వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1వ వార్డు పరిధిలోని సచివాలయాల్లో 70 మంది వలంటీర్లకు గాను 62 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందాయని తెలిపారు. మిగిలిన ఎనిమిది మంది కొత్తగా నియమితులయ్యారని చెప్పారు. కరోనా సమయంలో వలంటీర్ల సేవ మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రంగారెడ్డి, పార్టీ నాయకురాలు నూరి ఫాతిమా, సచివాలయ అడ్మిన్లు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

27 నుంచి ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట ఉత్సవాలు



తెనాలి రూరల్: స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీ భద్రావతీ సమేత భావనారుషిస్వామి దేవస్థాన ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట ఉత్సవాల్ని ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవాల గోడ పత్రికలు, కరపత్రాల్ని శనివారం రాత్రి ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఆలయ ధ్వజ స్తంభాన్ని 112 ఏళ్ల కిందట ప్రతిష్టించారని, తిరిగి ఇప్పుడు పునఃప్రతిష్టిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బిట్రా రామలింగేశ్వరరావు, బట్టు జగత్ కోటి నరేంద్ర, కొడాలి క్రాంతికుమార్, గుంటి ధనలక్ష్మి పాల్గొన్నారు.

రైతుబజార్‌లో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కొరిటెపాడు(గుంటూరు): ఆర్టీసీ బస్టాండ్ రైతుబజారులోని రైతులు, డ్వాక్రా మహిళలు, పూల షాపుల యజమానుల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండు వేసవిలో వినియోగదారులు, పాదచారులు, కార్మికుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో నాని, సురేష్, రవివర్మ, రాజు పాల్గొన్నారు.

అలరించిన సదాశివశాస్త్రి సంకీర్తనలు



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, కళాకారులు

నగరంపాలెం: నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అవరణలోని అన్నమయ్య కళావేదికపై శనివారం రాత్రి పప్పు సదాశివశాస్త్రి సంకీర్తనలు సభికుల్ని అలరించాయి. అనంతరం పప్పు సదాశివశాస్త్రిని, నందకుమార్ (వాయిలెన్), కె.అరవింద్ (మృదంగం)ను ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా మాజీ జడ్జి ప్రభాకర్ సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య, నాగార్జున సాంస్కృతిక కేంద్రం, సంగీత కళాశాల అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ, సాంస్కృతిక కేంద్రం కార్యదర్శి పి.ఎస్.ఆర్.మూర్తి, సంగీత కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: బృందావన్ గార్డెన్స్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పట్టాభిపురం పోలీసులు శనివారం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ. 80,400 స్వాధీనం చేసుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరుంధతీనగర్‌లో నివసించే రావెల రామకోటయ్య (48) గుంటూరు డిపో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం రాత్రి చీరతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడ్ని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

వ్యక్తిపై ముగ్గురు దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. బృందావన్ గార్డెన్స్‌కు చెందిన ప్రవీణ్ నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో వెళుతుండగా సాయి, మరో ఇద్దరు కలసి పాతకక్షల నేపథ్యంలో దాడి చేశారు. బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎన్టీఆర్ సినీ జీవితం రసవత్తరం



మల్లేశ్వరరావు, యుగంధర్, రామ్మోహనరావును సత్కరించిన కమిటీ సభ్యులు

తెనాలి రూరల్: ఎన్టీఆర్ సినీ జీవితం రసవత్తరం అని పలువురు అభిమానులు పేర్కొన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ సినిమాలు, రాజకీయ జీవితంపై శనివారం రాత్రి చర్చాగోష్టి నిర్వహించారు. సినీ రంగంలో ఎన్టీఆర్ ఎందుకు శకపురుషుడు ? అనే అంశంపై బిట్రా యుగంధర్, పోపూరి రామ్మోహనరావు ప్రసంగించారు. సినీ పరిశ్రమను నాటి మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చి, తెలుగు సినీరంగ విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం కవి, వ్యాఖ్యాత, నటుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరావును సత్కరించారు. కార్యక్రమంలో వెంపటి సత్యనారాయణ, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, విద్యార్థులు

గుంటూరు మెడికల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు జిల్లా రీజనల్ అధికారి (ఈఈ) ఎం.నారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మిషన్ లైఫ్ 7 థీమ్స్ పేరుతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు మే 16న ప్రారంభమయ్యాయి. జూన్ 5 వరకు జరుగనున్నాయి. అందులో భాగంగా శనివారం గుంటూరు నగరంలో పర్యావరణ పరిరక్షణ అవగాహన కోసం విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, సిబ్బందితో కలసి గుజ్జనగుండ్ల నుంచి టీజేపీఎస్ కాలేజీ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ అధికారి ఎం.నారాయణ మాట్లాడుతూ మనిషి జీవితంలో పర్యావరణ పరిరక్షణ అనేది భాగమని చెప్పారు. ప్రతి ఒక్కరూ చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా, స్వచ్ఛమైన గాలి, వాతావరణం ఉండటం వల్ల ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై బాధ్యతతో మెలగాలని సూచించారు. ఇంధన వినియోగాన్ని తగ్గించి, ప్రతి ఒక్కరు తమ కార్యాలయాలకు చిన్నచిన్న పనులకు, సైకిల్ వినియోగించడం ద్వారా ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి చుట్టుపక్కల వారికి మేలు చేసిన వారవుతారని తెలిపారు. ప్రజలందరికీ అవగాహన కల్పించడానికి సైకిల్ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు, ఎనలిస్ట్ వి. వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు కృషి

సంఘం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ రిజ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న రిజ్వాన్

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం ఖాజీల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఖాజీల సంఘం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ రిజ్వాన్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వ ఖాజీలందరూ జేఏసీగా ఏర్పడి ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు చెప్పారు. పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఖాజీల అసోసియేషన్ సమావేశాన్ని శనివారం సంఘ అధ్యక్షుడు ఖాజీ అబ్దుల్ అజీమ్ అధ్యక్షతను నిర్వహించారు. ఈ సందర్భంగా రిజ్వాన్ మాట్లాడుతూ ఖాజీలంతా మ్యారేజ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఒక ఖాజీ పని చేసే చోట మరొకరిని నియమించుకోవడాన్ని కూడా నిరోధిస్తామని చెప్పారు. ఖాజీలకు గుర్తింపు కార్డులతో పాటు హెల్త్ కార్డులు, నివాస గృహాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరతామని పేర్కొన్నారు. అనంతరం ఖాజీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, సంఘ నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఖాజీల సంఘం ఉపాధ్యక్షుడు ముఫ్తి ఖలీల్, కోశాధికారి ఇమామ్, ఏలూరు బాజీ, హుస్సేన్, ముఫ్తి జావీద్, తయ్యబ్, పలు జిల్లాల ఖాజీలు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీకి పేదలే సమాధి కడతారు



నిరసన ర్యాలీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: నిరుపేదలంటే చంద్రబాబుకు చులకన అని, పేదలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీకి సమాధికడతారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్లో భాగంగా పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల విషయంలో చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి రాగానే నవరత్నాల పథకాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మంది పేదలకు ఇంటిస్థలాలను అందించారన్నారు. చంద్రబాబు చరిత్రలో ఎన్నడూ పేదలకు సెంటు స్థలం ఇచ్చిందిలేదని ఎద్దేవా చేశారు. తాను ఇవ్వకపోగా పేదలు చిరకాల కోరిక సొంతింటి నిర్మాణాలను సమాధులతో పోల్చిన నీచ సంస్కృతి చంద్రబాబుదని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు టీడీపీని పేదలంతా కలసి సమాధికట్టాలని సూచించారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం అని చెప్పే చంద్రబాబుకు పేదలపై ఏమాత్రం ప్రేమ ఉందో అర్థమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, సర్పంచులు డబ్బూరి సూర్యప్రకాశరావు, నల్లమేకల అప్పమ్మ, దొడ్డా సామ్రాజ్యం, ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లిమేరి, సచివాలయాల మండల కన్వీనర్ ఎదురుపాక వెంకట్, పార్టీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, తంగెళ్ల నాగేశ్వరరావు, మాధవరావు, ఇంద్ర, ఏరువ జగన్‌మోహన్‌రెడ్డి, దొడ్డా రాంజీఅంబేడ్కర్, కందుకూరి జ్యోతి, దాసరి నాగరాజు, పోతురాజు, తోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో ఆర్ఆర్ఆర్ పాయింట్లు ఏర్పాటు



56వ డివిజన్‌లో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ కనకదుర్గ



వస్తువులను అందిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: మేరీ లైఫ్– మేరీ స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా నగరంలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) విధానాన్ని శనివారం నుంచి అన్ని డివిజన్లలో ప్రారంభించినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. డివిజన్‌కి ఒకటి చొప్పున మొత్తం 57 ఆర్ఆర్ఆర్ సెంటర్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు ప్రారంభించినట్లు చెప్పారు. నగరవాసులు, వ్యాపార వాణిజ్య సంస్థలు తమ వద్ద ఉన్న ఉపయోగించని, నిరుపయోగంగా ఉన్న దుస్తులు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువుల్ని సెంటర్లలో అందిస్తే, వాటిని పునర్వినియోగం, పునరుద్ధరణ లేదా కొత్త ఉత్పత్తికి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వస్తువుల సేకరణ ప్రాంతం, ఇతర అంశాలపై నగరంలో అన్ని వార్డ్ సచివాలయాల పరిధిలోని శానిటేషన్ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో గుంటూరు నగర పాలక సంస్థ అగ్ర భాగాన ఉందన్నారు. ప్రస్తుత మేరీ లైఫ్ – మేరీ స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమంలో కూడా నగర ప్రజలు పెద్దసంఖ్యలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు.

నగరంపాలెంలో..

ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ కోరారు. జీఎంసీ ఆధ్వర్యంలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రీయూస్) కేంద్రాన్ని శనివారం ఆర్.అగ్రహారంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమకు ఉపయోగపడని దుస్తులు, సామాన్లను ఆర్ఆర్ఆర్ కేంద్రానికి ఇవ్వడం వల్ల ఇతరులకు ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం కేంద్రంలో అప్పగించిన వస్తువు లను పలువురికి అందజేశారు. ఎంహెచ్‌వో భానుప్రకాష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవీంద్రనాయక్, పీఎంయూ బృంద సభ్యులు వర్ష, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఐటీసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.